

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 25-12-2022 సంపుటి : 04 సంచిక : 110 పేజీలు : 4 వెల : రూ 3-00

## భారతీయ గురుకుల విద్య ప్రపంచానికి ఆదర్శం

### స్వామినారాయణ గురుకుల్ అమృత్ మహోత్సవంలో మోడీ



న్యూఢిల్లీ,డిసెంబర్24 భారత గురుకుల విద్యా సంప్రదాయం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. 2014 తర్వాత వైద్య కాలేజీల సంఖ్య 65శాతానికి పైగా పెరిగిందన్నారు. కొత్త జాతీయ విద్యావిధానం ద్వారా.. మెరుగైన విద్య అందుతుందని చెప్పారు. శ్రీ స్వామినారాయణ గురుకుల్ రాజ్ కోట్ సంస్థాన్ 75వ అమృత్ మహోత్సవంలో.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మోడీ ప్రసంగించారు. స్వామినారాయణ గురుకుల్ సంస్థ భవిష్యత్ మరింత ఉజ్వలంగా ఉండాలని ఆశిస్తున్నానన్నారు.ఇస్రో నుండి షార్క్ వరకు గురుకులాలకు చెందిన వారసత్వమే ఉందని ప్రధాని మోడీ అన్నారు. వీరు దేశం యొక్క ప్రతిభను శక్తివంతం చేశారన్నారు. పేద విద్యార్థులకు సహాయం చేస్తున్నందుకు గురుకులంపై మోడీ ప్రశంసలు కురిపించారు. పేద విద్యార్థుల విద్యను పూర్తి చేయడానికి గురుకులం రోజుకు ఒక రూపాయి వసూలు చేస్తుందని అన్నారు. దీనివల్ల పేద విద్యార్థులు చదువుకో గలుగుతున్నారని చెప్పారు. నలంద, తక్షశిల వంటి పురాతన విశ్వవిద్యాలయాల వారసత్వాన్ని మోడీ గుర్తుచేశారు. ప్రాచీన కాలం

నాటి గురుకులాల వైభవం, మహిమ, వైభవానికి ఈ సంస్థలు ఉదాహరణలు అని అన్నారు. గార్గి, మైత్రేయి వంటి మహిళా సాధువులు చేసిన సేవలను కూడా ఆయన గుర్తు చేసుకుంటూ, 'లింగ సమానత్వం వంటి పదాలు పుట్టకపోయినప్పటికీ, గార్గి , మైత్రేయి వంటి మన సాధువులు శాస్త్రాలను అధ్యయనం చేసేవారని చెప్పారు.

## పులివెందుల బస్ టెర్మినల్‌పై నెగెటివ్ ప్రచారం..



వైఎస్ఆర్ కడప: జిల్లా పర్యటనలో భాగంగా రెండోరోజు శనివారం తన సొంత నియోజకవర్గం పులివెందులలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.పులివెందులలో డా. వైఎస్ఆర్ బస్ టెర్మినల్ ప్రారంభించడం సంతోషంగా ఉంది. మిగిలిన బస్టాండ్లకు రోల్‌మోడల్‌గా పులివెందుల బస్టాండ్ తీర్చిదిద్దాం. ఒకవైపు బస్ టెర్మినల్ పనులు కనిపిస్తున్నా నెగెటివ్ ప్రచారం చేస్తున్నారు అని సీఎం జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు టెర్మినల్ పనులు జరుగుతున్నా కూడా.. నెగెటివ్ మీడియాతో చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారు. అలాంటి చెడిపోయిన వ్యవస్థతో మనం యుద్ధం చేస్తున్నాం. చంద్రబాబు తీరు ఎలా ఉందంటే.. ఒక గ్లాస్‌లో 75 శాతం నీళ్లు ఉన్నా.. అసలు గ్లాసులో నీళ్లు లేవనే ప్రచారం చేస్తున్నారు. గతంలో అదే బడ్జెట్.. ఇప్పుడూ అదే బడ్జెట్. గత ప్రభుత్వం ఇన్ని పథకాలు

### చెడిపోయిన వ్యవస్థతో మనం యుద్ధం చేస్తున్నాం: సీఎం జగన్

ఎందుకు ఇవ్వలేకపోయింది? అని సీఎం జగన్ ప్రతిపక్ష టీడీపీని నిలదీశారు. కావాలనే మన ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. గత ప్రభుత్వం కన్నా మనం చేసిన అప్పులు తక్కువేనని సీఎం జగన్ స్పష్టం చేశారు.జరిగిన అభివృద్ధి చూస్తే.. పులివెందులలోనే ఉన్నామా? అనిపిస్తోంది. సీఎం మారడంతోనే పేదల తలరాతలు మారుతున్నాయి. అవినీతికి తావు లేకుండా సంక్షే పథకాలు అందిస్తున్నాం. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నాం. పులివెందులలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ 2023 నాటికి పూర్తవుతుంది. వేంపల్లెలలో రహదారుల విస్తరణకు భూసేకరణ కూడా జరిగింది. వచ్చే రెండేళ్లలో పులివెందులను ఒక నగరంగా మార్చే పరిస్థితికి చేరుకుంటుంది. ఆదర్శ నియోజకవర్గంగా పులివెందుల అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు సీఎం జగన్ ఆకాంక్షించారు. దేవుడి దీవెనలతో.. ప్రజల ఆశీస్సులతో మరింత మంచి చేసే అవకాశం తనకు కలగాలని ఆయన కోరుకున్నారు.

## ఏపీపీఎస్సీ కొత్త నిబంధన.. ఆ అభ్యంతరాలకు రూ.100 చెల్లించాలి

### వేలాదిగా తప్పుడు అభ్యంతరాలు వస్తుండటంతో నిర్ణయం

### అభ్యంతరం సరైనదని తేలితే ఆ డబ్బులు తిరిగి చెల్లింపు

అమరావతి: వివిధ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్షల్లో ఇచ్చే ప్రశ్నలు, వాటి జవాబులపై అభ్యర్థులు లేవనెత్తే అభ్యంతరాలకు ఒక్కో దానికి రూ.100 చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కొత్త నిబంధన విధించింది. ఇటీవల విడుదల చేసిన రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లు అన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది. కమిషన్ నిర్వహించే వివిధ పరీక్షల్లో కీలపై వస్తున్న వేలాది అభ్యంతరాల్లో తప్పుడువే అత్యధికంగా ఉంటున్నాయి.'కమిషన్ నిర్వహించిన రిక్రూట్‌మెంట్ పరీక్ష (స్క్రీనింగ్ టెస్టు)ల్లో ఆబ్జెక్టివ్ టైప్ పేపర్‌లోని ప్రశ్నలు, వాటి సమాధానాల కీలకు వ్యతిరేకంగా అభ్యర్థులు తప్పుడు, అసంబద్ధమైన అభ్యంతరాలను వేలాదిగా దాఖలు చేస్తున్నారు. వీటిని పరిశీలించి పరిష్కరించే క్రమంలో ఫలితాల ప్రకటన సహా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో విపరీత జాప్యం జరుగుతోంది.అందువల్ల కమిషన్ నిర్వహించే అన్ని పరీక్షలకు వర్తించేలా ఒక నిబంధన చేర్చాలని కమిషన్ నిర్ణయించింది. దీని ప్రకారం ప్రశ్న పత్రం, జవాబు కీ, ఇతర విషయాలకు సంబంధించిన వివాదాల పరిష్కారం కింద ఈ నిబంధన పెట్టాలని కమిషన్ నిర్ణయించింది. ఇకపై అభ్యర్థి ప్రశ్న, జవాబు కీకి వ్యతిరేకంగా లేవనెత్తే ప్రతి అభ్యంతరానికి రూ.100 చొప్పున నిర్ణీత గడువులోగా చెల్లించాలి. తుది పరిశీలనలో ఈ అభ్యంతరాల్లో నిజమైన వాటిని దాఖలు చేసిన అభ్యర్థులకు ఆ మొత్తాన్ని తిరిగి కమిషన్ చెల్లిస్తుంది.' అని కమిషన్ కార్యదర్శి హెచ్.అరుణ్‌కుమార్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




## 'బీసీ రిజర్వేషన్ వల్ల కాపులకు ఉపయోగం లేదు'



అమరావతి: బీసీ రిజర్వేషన్ వల్ల కాపులకు ఉపయోగం లేదని తమిళనాడు మాజీ సీఎస్ రామ్మోహనరావు కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో బీసీ రిజర్వేషన్ కోసం పోరాటం చేయొద్దని తాను చెప్పిన విషయాన్ని మరోసారి ప్రస్తావించారు రామ్మోహనరావు.కాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో రామ్మోహనరావు ఈ వ్యాఖ్యలు చేశారు.' బీసీ రిజర్వేషన్ అనేది కాపుల సంక్షేమానికి కంటితుడుపు చర్యే తప్ప.. సామాజికంగా ఎటువంటి ప్రయోజనం లేదు. రాజకీయాల వల్ల కాపు అనే కులం డైవర్ట్ అయ్యింది. కాపు రిజర్వేషన్ ఉద్యమం వల్ల బీసీలకు కాపులు దూరమవుతున్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కాపులకు బీసీ రిజర్వేషన్ సాధ్యం కాదు. తునిలో పెట్టిన బీసీ రిజర్వేషన్ సభతో కాపులను అల్లరి మూకలుగా ముద్ర వేశారు. ఒకే సామాజికి వర్గానికి చెందిన వారు ఏపీ నుంచి ముగ్గురు సుప్రీం కోర్టు జడ్జిలయ్యారు. వారికేమీ రిజర్వేషన్లు లేవు' అని వ్యాఖ్యానించారు రామ్మోహనరావు.

## ఎన్టీఆర్ అందుకే వెన్నుపోటుకు గురయ్యారు.. వెంకయ్యనాయుడు ఇంట్రెస్టింగ్ కామెంట్స్

గుంటూరు: దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. సీనియర్ ఎన్టీఆర్ అందుకే వెన్నుపోటుకు గురయ్యారు అంటూ ఆసక్తికర కామెంట్స్ చేశారు.కాగా, వెంకయ్యనాయుడు శనివారం తెనాలిలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో వెంకయ్య నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. కుట్రలు, కుతంత్రాలు ఎన్టీఆర్ గమనించలేకపోయారు. రాజకీయాల్లో ఎన్టీఆర్ భోళా మనిషి. అందుకే వెన్నుపోటుకు గురయ్యారు. ఎన్టీఆర్ రాజకీయాల్లో సైలెంట్ విప్లవాన్ని తెచ్చారు. పేదల సంక్షేమానికి అనేక పథకాలు తెచ్చారు అంటూ కామెంట్స్ చేశారు.



## మార్గదర్శి చిట్‌ఫండ్ చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తోంది

### ఇలా చేయడం చట్టాన్ని, ప్రజలను మోసం చేయడమే

### ఇటీవల చాలా కంపెనీలు ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డాయి

### అలాంటి పరిస్థితి ప్రజలకు రాకూడదనే మార్గదర్శి విషయంలో చర్యలు

### రిజిస్ట్రార్‌కు సమర్పించాల్సిన వివరాలనూ ఇవ్వడంలేదు

### చట్టమే వర్తించదన్నట్లు మార్గదర్శి వ్యవహరిస్తోంది

### హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

### ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్న మార్గదర్శి

### మార్గదర్శి అనుబంధ వ్యాజ్యాలపై తీర్పు వాయిదా



అమరావతి: చిట్‌ఫండ్ చట్టం నిబంధనలను అనుసరించనందుకు తమకు ఎలాంటి పెనాల్టీ విధించకుండా, అధికారులు చట్ట నిబంధనల ప్రకారం నడుచుకునేలా ఆదేశించాలంటూ మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టులో దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాల్లో వాదనలు శుక్రవారం ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు న్యాయస్థానం ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.తమ వ్యవహారంలో అధికారులు నిబంధనల మేరకు నడుచు కునేలా ఆదేశాలు జారీ చేయాలంటూ మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ అధీకృత అధికారి బి.శ్రీనివాసరావు దాఖలు చేసిన పిటిషన్, అనుబంధ వ్యాజ్యాలపై జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శుక్రవారం విచారణ జరిపారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. మార్గద ర్శి చిట్‌ఫండ్ సంస్థ చట్ట నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుం డటం వల్లే సోదాలు చేపట్టామన్నారు. ఇటీవల చాలా కంపెనీలు ప్రజల నుంచి సేకరిస్తున్న సొమ్ము విషయంలో ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నాయని, అలాంటి పరిస్థితులు ప్రజలకు రాకూడదన్న ఉద్దేశంతోనే మార్గదర్శి వ్యవహారంలో చర్యలు చేపట్టామన్నారు. ప్రజల నుంచి చిట్ రూపంలో సేకరించిన డబ్బును ఓ ప్రత్యేక ఖాతాలో జమ చేయాలని, మార్గదర్శి అందుకు విరుద్ధంగా కార్పొరేట్ ఖాతాలో జమ చేస్తోందని తెలిపారు. ఆ సొమ్మును ఉషాకిరణ్ మూవీస్, ప్రియా ఫుడ్స్, ఉషోదయా పబ్లికేషన్స్, రమాదేవి ట్రస్ట్ వంటి అనుబంధ కంపెనీలకు, ఇతర అవసరాలకు మళ్లిస్తోందని, ఎన్నో ఏళ్ల నుంచి ఈ తంతు సాగుతోందని నివేదించారు. ఇది ప్రజలను, చట్టాన్ని మోసం చేయడమేనన్నారు. ప్రతి చిట్ ఆస్తి, అప్పుల పట్టీని రిజిస్ట్రార్‌కు సమర్పించాలని, మార్గదర్శి ఆ పని కూడా చేయడంలేదని చెప్పారు.ప్రజలు ఏ రకంగానూ మోసపోకూడదనే ఉద్దేశంతోనే మార్గదర్శి రికార్డులన్నింటినీ పరిశీలిస్తు న్నామని, చిట్‌ఫండ్ కంపెనీ రికార్డులను పరిశీలించే అధికారం అధికారులకు ఉందని తెలిపారు. మార్గదర్శి హెడ్ ఆఫీస్ హైదరాబాద్‌లో ఉంది కాబట్టి ఏపీలోని ఆ సంస్థ కార్యాలయాల్లో సోదాలు చేయకూడదనడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ చట్ట నిబంధనలూ వర్తించవన్నట్లు మార్గదర్శి వ్యవహరిస్తోందన్నారు. కొత్త చిట్ ప్రారంభించేందుకు అనుమతి కోరుతూ ప్రతిపాదనలు సమర్పించినప్పుడు పాత చిట్ రికార్డులు పరిశీలించే అధికారం రిజిస్ట్రార్‌కు ఉందన్నారు.కొత్త చిట్‌కు అనుమతివ్వాలా లేదా అన్నది పూర్తిగా రిజిస్ట్రార్ విచక్షణపై ఆధారపడి ఉంటుందన్నారు. చిట్‌కు అనుమతివ్వాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించ డానికి వీల్లేదన్నారు. ప్రజల క్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు కక్ష సాధింపు ఎలా అవుతుందని అన్నారు. రికార్డులు అడుగు తుంటే కుంటి సాకులతో తప్పించుకుం టున్నారని వివరించారు. రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ వద్ద అన్ని డాక్యుమెంట్లను సమర్పించిన తరువాత వ్యాపారం కొనసాగించవచ్చని చెప్పారు. ఈ కేసులో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని ఆయన కోర్టును అభ్యర్థించారు.అంతకు ముందు మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. రిజిస్ట్రార్ నిబంధనల ప్రకారం నడుచుకోవడంలేదన్నారు. కార్పొరేట్ ఆఫీస్, బ్రాంచ్ ఆఫీసుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను కోరజాలరన్నారు. చిట్ డబ్బుపై సెక్యూరిటీ మొత్తాన్ని రిజిస్ట్రార్ వద్ద జమ చేస్తున్నామని తెలిపారు. ఫోర్‌మెన్ సెక్యూరిటీ ఇవ్వాలని చట్టంలో ఎక్కడా లేదన్నారు. ఎలాంటి ఫిర్యాదు లేకపోయినా అధికారులు సోదాల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ముందుగా నోటీసు ఇవ్వకుండా, కారణాలు చెప్పకుండా కొత్త చిట్‌కు అనుమతిని తిరస్కరించడం చట్ట విరుద్ధమన్నారు. ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని అన్నారు.

## జ్ఞానవాపి తరహాలోనే.. శ్రీకృష్ణ జన్మభూమి వివాదంపై మధుర కీలక తీర్పు

న్యూఢిల్లీ: శ్రీకృష్ణ జన్మభూమి–షాహీ ఈద్గా కేసు వివాదంలో శనివారం కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉత్తర ప్రదేశ్‌లోని



మధురు స్థానిక కోర్టు కీలక తీర్పు వెలువరించింది.వివాదాస్పద స్థలంలో సర్వే చేపట్టాలని కోర్టు అమిన్‌కు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జనవరి 20వ(2023) తేదీలోగా సర్వే పూర్తి చేసి.. ఆ నివేదికను తమ ముందు ఉంచాలని ఆదేశించింది

.జనవరి 2వ తేదీ తర్వాత నుంచి ఈ సర్వేను చేపట్టాలని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు సూచించింది. షాహీ ఈద్గాలో ఉన్న 13.37 ఎకరాలు తమకు అప్పగించాలని హిందూ సంఘాలు పిటిషన్ దాఖలు చేశాయి. హిందూ సేన దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా కోర్టు ఈ తీర్పు ఇచ్చింది. కోర్టు ఆదేశాలకు ఇరు పక్షాలు కట్టుబడి ఉండాలని స్పష్టం చేస్తూ.. నోటీసులు జారీ చేసింది.అది కృష్ణ జన్మస్థలమని, మొగలు చక్రవర్తి ఔరంగజేబ్ అక్కడున్న ఆలయాన్ని కూల్చేయించి.. ఈద్గా కట్టించాడని హిందూ సేన అధ్యక్షుడు విష్ణు గుప్తా, ఉపాధ్యక్షుడు సుర్జిత్ సింగ్ యాదవ్‌లు వాదిస్తున్నారు. అంతేకాదు 1968లో శ్రీకృష్ణ జన్మస్థాన సేవా సంఘ్‌కు, షాహీ మసీద్ ఈద్గాకు మధ్య జరిగిన ఒప్పందాన్ని సైతం వీళ్లు న్యాయస్థానంలో సవాల్ చేశారు.ఇదిలా ఉంటే.. జ?క్షానవాపి మసీద్ కేసులోనూ వారణాసి కోర్టు ఇదే తరహాలో వీడియోగ్రాఫిక్ సర్వేకు ఆదేశించిన విషయం తెలిసిందే.

# సంపాదకీయం

ఆదివారం 25-12-2022

## మద్య రాజకీయాలు....

దేశం మొత్తం రాజకీయాలను మద్యం డామినేట్ చేస్తోంది. ఢిల్లీ లిక్కర్ స్కాం లో తెలంగాణ, ఢిల్లీ రాష్ట్రాలు ఉక్కిరి బిక్కిరై పోతుంటే.. సంపూర్ణ మద్య నిషేధం అమలులో ఉన్న బీహార్ రాష్ట్రం మరో కారణంతో మద్యం రాజకీయంతో ఉక్కిరి బిక్కిరి అయిపోతోంది. బీహార్ లో కల్తీ మద్యం మృతుల విషయంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిపై ఒత్తిడి పెరిగిపోతోంది. ప్రభుత్వ వైఫల్యం వల్లనే సంపూర్ణ మద్య నిషేధం అమలులో ఉన్న రాష్ట్రంలో కల్తీ మద్య నిషేధం యథేచ్ఛగా ఏరులై పారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విమర్శలకు నితీష్ కుమార్ చాలా దీటుగా, ఘాటుగా సమాధాన మిచ్చారు. బీహార్ లో మద్య నిషేధం అమలులో ఉందనీ, ఆ విషయాన్ని ప్రస్తుతిండం మాని కల్తీ మద్యంపై తనను విమర్శించడమేమిటని నిలదీస్తున్నారు. మద్య నిషేధం అమలులో ఉన్న బీహార్ తో పాటు దేశంలో మద్య నిషేధం అమలులో లేని రాష్ట్రాలలోనూ కల్తీ మద్యం పై విచారణ జరిపించాలని ఆయన సవాల్ చేస్తున్నారు. బీహార్ శరన్ జిల్లాలో జరిగిన కల్తీ మద్యం మరణాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ దర్యాప్తును ప్రశ్నించిన నితీష్, జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ హెచ్ ఆర్ సీ) కి దమ్ముంటే ఇతర రాష్ట్రాలలోనూ కల్తీ మద్యం మృతుల ఘటనలపై దర్యాప్తు చేపట్టాలని సవాల్ చేశారు. కల్తీ మద్యం కాటుకు మరణిస్తున్న సంఘటనలు ఒక్క బీహార్ లోనే కాదు.. దేశంలోని ఇతర రాష్ట్రాలలోనూ జరుగుతున్నాయని నితీష్ అంటున్నారు. బీహార్ లో ఏడేళ్ల కిందటే ( ఇంకా సరిగ్గా చెప్పాలంటే 2016) నుంచీ మద్యం తయారీ, విక్రయాలు, వినియోగం అన్నిటిపైనా సంపూర్ణ నిషధం అమలులో ఉంది. ఆల్కహాల్ సేవనంతో మరణాలు దేశంలోని ఏ ప్రాంతంలో జరగటం లేదు? గతంలో ఇలాంటివి జరగ లేదా? విషపూరితమైన కల్తీ మద్యం తాగి ఎంతమంది మరణించ లేదు? మరి అలాంటప్పుడు మానవ హక్కుల కమిషన్ కేవలం బిహార్ లోనే ఎందుకు దర్యాప్తు చేసేందుకు అత్యుత్సాహం చూపుతోంది? ఎన్ హెచ్ ఆర్సీ వెనుక ఉన్నది బీజేపీయేనా? అంటూ నితీష్ సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్ హెచ్ ఆర్సీపై ఉంది. అలాగే బీహార్ లో కల్తీ మద్యం మరణాలను భూతద్దంలో చూపి విమర్శలు గుప్పించే బీజేపీకి ఇతర రాష్ట్రాల్లో జరిగే ఇలాంటి మద్యం మరణాలు కనిపించవా అన్నప్రశ్నలూ తలెత్తుతున్నాయి. అయితే నితీష్ ప్రశ్నలపై బీజేపీ స్పందించడంలేదు. అయితే మద్యం మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలన్న డిమాండ్ ను మాత్రం బీజేపీ బలంగా చేస్తోంది. మొత్తం మీద 82 మంది ఉసురు తీసిన బిహార్ కల్తీ మద్యం వ్యవహారంలో మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ప్రశక్తే లేదని బీహార్ సీఎం చేసిన ప్రకటన మాత్రం విపక్షాలకు ఆయుధంగా మారింది. నిజానికి మద్య నిషేధం బిహార్, గుజరాత్ లో అమల్లో ఉందన్న మాటే కానీ ఎక్కడా నిషేధం ఆనవాలు కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. 2015లో మద్య నిషేధం బిల్లు బిహార్ అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు బీజేపీ ఈ బిల్లు కుమద్దతు ఇచ్చింది. ఇప్పుడు అదే బీజేపీ ఇదే విషయంపై నితీష్ పై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నది. అప్పట్లో ప్రధాని మోడి కూడా నితీష్ ను ఒకప్పుడు ప్రశంసించి, మద్య నిషేధంతో నితీష్ చాలా సాహసోపేతమైన అడుగులు వేస్తున్నారని'' మోడీ అభినందించారు. ఇక మద్య నిషేధం అమలులో ఉన్న గుజరాత్ లో సైతం కల్తీ మద్యం కారణంగా 42 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతిని బీజేపీ ఇప్పుడు కన్వీనియెంట్ గా మరచిపోయింది. బిహార్ అసెంబ్లీలో ఏకగ్రీవంగా మద్య నిషేధం బిల్లు పాసైనా ఒక్క ఆర్జేడీ మాత్రం ఈ చట్టం అమలుపై సందేహాలు వెలిబుచ్చింది. అంతకు ముందు లాలూ సీఎంగా ఉన్నప్పుడు మద్యంపై ఏకంగా పన్నునే ఎత్తేశారు! మద్య నిషేధాన్ని నితీష్ ప్రకటించగానే .. డ్రై స్టేట్ లో రెవిన్యూ ఎక్కడి నుంచి వస్తుంది? పెట్టుబడులు ఎక్కడి నుంచి తెస్తారు? ఇలా డ్రై స్టేట్ అయితే కొత్త పెట్టుబడులు రావని విమర్శలు గుప్పించిన వారంతా. అప్పటికే మద్య నిషేధం అమలులో ఉన్న మ గుజరాత్ కు పెట్టుబడుల వరద ఎలా వస్తోందని మాత్రం ప్రశ్నించలేదు. అలాగే 2016లో నితీష్ బీహార్ లో మద్య నిషేధం విధించినప్పుడు మోడీ ప్రశంసలు కురిపించారు. ఇప్పుడు విమర్శలు గుప్పిస్తున్నారు. అప్పుడు ఒప్పన్నది ఇప్పుడు తప్పు అంటున్నారు. అలాగే మోడీ పెద్దనోట్లు రద్దు చేయడాన్ని అప్పట్లో నితీష్ సమర్ధించారు. ఇప్పుడు అది పెద్ద కుంభకోణం అని విమర్శిస్తున్నారు. రాజకీయం అంతే. మొత్తం మీద దేశం అంతటా మద్యం రాజకీయమే నడుస్తోంది. ఇందుకు ఏ రాష్ట్రం కూడా మినహాయింపు కాదు.

## సెంటిమెంట్ పండించే పనిలో జగన్



విజయవాడ, డిసెంబర్ 24, ఇదే నా రాష్ట్రం.... ఇక్కడే నా నివాసం ఇక్కడే మమకారం..... ఇక్కడే రాజకీయం ఇక్కడి ప్రజల సంతోషమే నా విధానం..... ఇక్కడి ఐదు కోట్ల ప్రజలే నా కుటుంబం ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ప్రతి రాజకీయ పార్టీ సెంటిమెంట్ ను కూడా కొంత జోడిస్తుంది. గత ఎన్నికల్లో ఒకే ఒక్క ఛాన్స్ అని జగన్ అధికారంలోకి వచ్చారు. అలాగే ఈ ఎన్నికల సమయంలో చంద్రబాబు తనకు లాస్ట్ ఛాన్స్ ఇవ్వాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ సయితం తనకు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని కోరుతున్నారు. ఛాన్స్ ల నినాదాలు ఇలా కొనసాగుతుండగానే ఇప్పుడు మరోసారి రాష్ట్రంలో మరో సెంటిమెంట్ కూడా మొదలయింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్ హైదరాబాద్ లో ఉండి చుట్టపు చూపుగా ఆంధ్రప్రదేశ్ కు వచ్చి రాజకీయం చేసి వెళుతున్నారన్న ప్రచారాన్ని వైసీపీ మొదలు పెట్టేసింది. పన్నులు, ఫీజులు తెలంగాణలో కట్టి ఏపీలో రాజకీయం చేస్తామంటే ఎలా? అని ప్రశ్నిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ప్రజలకు ఉపయోగపడేలా పన్నులు ఇక్కడ చెల్లించాలి కదా? అని నెటిజెన్లు ప్రశ్నిస్తున్నారు. వీకెండ్ వచ్చి ఇక్కడ రాజకీయాలు చేయడమేంటని? అక్కడే షూటింగ్ లు చేసి ఆదాయాన్ని తెలంగాణకు పంచి పెడుతున్నారన్న విమర్శలు కూడా వైసీపీ సోషల్ మీడియా నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను నిలదీస్తున్నారు. ఇక చంద్రబాబు రెండు రోజుల క్రితం ఖమ్మం జిల్లాలో బహిరంగ సభ పెట్టారు. తెలంగాణలోనూ టీడీపీ ఉంటుందని తెలిపారు. తెలంగాణలోనూ టీడీపీని దీవించాలని కోరారు. తెలంగాణను అభివృద్ధి చేసింది తానేనని తెలిపారు. గత ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు ఈసారి బీజేపీతో పొత్తు కోసం ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే జగన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. వారి మాదిరిగా తాను రాజకీయం చేయబోనని తెలిపారు. ఈ పార్టీ కాకపోతే మరో పార్టీ తాను అనబోనని అన్నారు. ఈ రాష్ట్రం కాకపోతే ఆ రాష్ట్రం అని అనడం లేదన్నారు. దత్తపుత్రుడిలా ఈ భార్య కాకపోతే మరో భార్య అని కూడా అని తాను అనడం లేదన్నారు. చంద్రబాబు రెండు కళ్ల సిద్ధాంతాన్ని మళ్లీ తెరపైకి తెచ్చారని పోస్టింగ్ లు కనపడుతున్నాయి. తన రాజకీయం ఇక్కడేనని తెలిపారు. వైసీపీ ఒక్కటే పోటీ చేస్తుందని పరోక్షంగా చెప్పారు. ఏపీ లోనే తన పాలిటిక్స్ కొనసాగుతాయని తెలిపారు. తాను రాష్ట్రం వదిలి వెళ్లబోనని, ఇక్కడే ఉండి ప్రజా సమస్యల కోసం ఉంటానని జగన్ చెప్పారు. జగన్ ఈ రకమైన సెంటిమెంట్ ను ప్రజల్లోకి పంపే ప్రయత్నంలో ఉన్నారని కనిపిస్తుంది. వారిద్దరి మాదిరి హైదరాబాద్ లో ఉండనని, అక్కడ నివాసం ఉండనని కూడా చెప్పారు. ఇలా సెంటిమెంట్ తో జగన్ మరోసారి ప్రజలను తన వైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. సంక్షేమం + సెంటిమెంట్ కలిపితేనే విజయం రెండోసారి గ్యారంటీ అని నమ్ముతున్నారేమో.. రానున్న రోజుల్లో ఇంకెన్ని పంచ్ డైలాగులు ఏపీ పొలిటీషియన్స్ నుంచి వినాల్సి వస్తుందో చూడాలి.

## విశాఖ, అనంతల్లో లాజిస్టిక్ పార్కులు

విజయవాడ, డిసెంబర్ 24,విశాఖపట్నం, అనంతపురంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ సహాయ మంత్రి ఓం ప్రకాష్ వెల్లడించారు. లాజిస్టిక్ పార్కుల ఏర్పాటు కోసం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ వివిధ రాష్ట్రాల్లో మొత్తం 35 ప్రదేశాలను గుర్తించి మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు అభివృద్ధి చేస్తోందని, వాటి పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు.. నేషనల్ లాజిస్టిక్ పాలసీని కేంద్ర కేబినెట్ ఈ ఏడాది సెప్టెంబర్ 21న ఆమోదించిందని మంత్రి పేర్కొన్నారు. దేశంలో లాజిస్టిక్ పార్కులు అభివృద్ధి చేయడం ద్వారా లాజిస్టిక్ సమర్థత పెంచి వ్యయాన్ని తగ్గించడం నేషనల్ లాజిస్టిక్ పాలసీ ముఖ్య ఉద్దేశమని మంత్రి వివరించారు. పూర్తిస్థాయి లాజిస్టిక్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చేయడం ద్వారా లాజిస్టిక్ ఖర్చును గణనీయంగా తగ్గించడం ఎన్ ఎల్ పీ-2022 సమగ్ర ఎజెండా అని మంత్రి తెలిపారు. ఆర్థిక వ్యవస్థ సమగ్రాభివృద్ధి కోసం సమర్థవంతమైన లాజిస్టిక్ సెక్టార్ అవసరమని అన్నారు. మొత్తం జీడీపీలో లాజిస్టిక్ సెక్టార్ వాటాకు సంబంధించిన వివరాలు ప్రస్తుతం లేనప్పటికీ రైల్వే, రోడ్డు రవాణా, జల రవాణా, వాయు రవాణా, కమ్యూనికేషన్, బ్రాడ్ కాస్టింగ్ సేవలు ఇతర లాజిస్టిక్ సెక్టార్ల జీవీఏ (గ్రాస్ వాల్యూ యాడెడ్) 2018-19లో 1,71,75,128 కోట్లు, 2019-20 లో 1,83,55,109 కోట్లు, 2020-21లో 1,80,57,810 కోట్లు ఉందని మంత్రి పేర్కొన్నారు. విశాఖలో ఏపీఐఐసీకి చెందిన 389.14 ఎకరాల్లో లాజిస్టిక్ పార్కును ఏర్పాటు చేయనున్నారు. ఇది జాతీయ రహదారికి 8 కిలో మీటర్ల దూరంలో విశాఖ పోర్టుకు 33 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈ లాజిస్టిక్ పార్క్ కేంద్రంగా విదేశాల నుంచి ఎగుమతులు, దిగుమతులకు సౌలభ్యంగా ఉంటుంది. విశాఖపట్నంలోని పదకొండ వందల పరిశ్రమలతో పాటు ఆ జిల్లాలో ఫార్మాసిటీకి సమీపంలో ఉంది. ఉత్తరాంధ్ర ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్ గఢ్, తదితర రాష్ట్రాల్లో పారిశ్రామిక అవసరాలకు ఈ లాజిస్టిక్ పార్క్ కేంద్ర స్థానంగా మారనుంది. లాజిస్టిక్ పార్క్ కోసం గుర్తించిన ప్రాంతానికి పారిశ్రామిక అవసరాల కోసం దాదాపు 9 వేల ఎకరాల భూమి ఏఐసీసీ ఆధీనంలో ఉంది. దాంతో ఆ ప్రాంతంలో కొత్త పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రోత్సాహకంగా ఉంటుంది. దాంతో ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయి. అనంతపురంలో లాజిస్టిక్ పార్క్ కోసం ఏపీఐఐసీ 205 ఎకరాలను గుర్తించింది. ఆ ప్రదేశం కియా పరిశ్రమకు 7 కిలో మీటర్ల దూరంలో, జాతీయ రహదారికి 10 కిలో మీటర్లు, బెంగళూరు విమానాశ్రయానికి 142 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఆ ప్రాంతంలో లాజిస్టిక్ పార్కు ఏర్పాటుతో అనంతపురంలో జిల్లాలోని 27 వందల పరిశ్రమలకు ప్రయోజనకరం. ఆటో మొబైల్, సౌర విద్యుత్తు, మినరల్, ఫార్మాస్యూటికల్, బయోటెక్నికల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ఈ లాజిస్టిక్ పార్కు ఉపయోగకరంగా ఉంటుంది. ఈ పార్కు కోసం గుర్తించిన భూములకు సమీపంలో పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీ ఆధీనంలో 3 వేల 500 ఎకరాల భూమి ఉంది. దాంతో ఆ ప్రాంతంలో కొత్త పరిశ్రమలు నెలకల్పేందుకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. తద్వారా భారీగా ఉపాధి అవకాశాలు ఉంటాయి.

## మిత్రుల మధ్య టిక్కెట్ లొల్లి..

అనంతపురం, డిసెంబర్ 24, అనంతపురం, జిల్లాలోని ఆ నియోజకవర్గం ఇప్పుడు మిత్రుల మధ్యే విభేదాలు సృష్టించబోతోందా? పొత్తుల్లో భాగంగా ఆ సీటు ఎవరికి దక్కబోతోంది ? ఏ పార్టీ ఈ నియోజకవర్గాన్ని త్యాగం చేయాల్సి వస్తుంది ? ఇంతకీ ఆ నియోజకవర్గంలో అధికారపార్టీ బలంగా ఉందా లేదంటే విపక్షమా ? ఏపీలో విపక్షాలన్నీ ఒక్కటై ఎన్నికల బరిలోకి దిగాలని భావిస్తున్నాయి. అయితే ఎవరు ఎవరితో పొత్తు పెట్టుకుంటారన్నది ఇంకా తేలలేదు. టిడిపి -బీజేపీతో కలిసి జనసేన బరిలోకి దిగుతుందా లేదంటే పచ్చపార్టీతో కలిసి ముందుకెళ్తుందా అన్నది ఇంకా పవన్ కల్యాణ్ తేల్చలేదు. అటు బీజేపీ కూడా జనసేనతో కలిసి ఉంటామని చెబుతున్నా కానీ ఎన్నికల్లో పొత్తుపై క్లారిటీ ఇవ్వడం లేదు. ఇలాంటి టైమ్‌లో ఆ నియోజవర్గంలో సీటు కోసం ఇటు టిడిపి అటు జనసేన నేతలు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఎవరికి రానున్న ఎన్నికల్లో ఈ నియోజవర్గం నుంచి పోటీ చేసే ఛాన్స్ వస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఇంతకీ ఆ నియోకవర్గం ఏంటంటే ధర్మవరం. అనంతపురం జిల్లాలోని ధర్మవరం నియోజకవర్గం ఇప్పుడు టిడిపి-జనసేనల మధ్య చిచ్చుపెట్టబోతోందన్న టాక్ వినిపిస్తోంది. ఎందుకంటే ఈ నియోజవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని టిడిపి నేత ఆ నియోజకవర్గ ఇంఛార్జ్ పరిటాల శ్రీరామ్ భావిస్తున్నారు. చంద్రబాబు సూచనల మేరకు ధర్మవరం ఇంఛార్జ్ గా వ్యవహరిస్తూ పార్టీని ముందుకు నడిపిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఈ సీటు తనకివ్వాలని ఇప్పటికే తల్లి పరిటాల సునీత ద్వారా చంద్రబాబుకి విన్నవించారట. అయితే టిడిపి అధినేత మాత్రం మౌనంగా ఉన్నారట. అందుకు కారణం గత ఎన్నికల్లో పరిటాల శ్రీరామ్ ఓటమిపాలవ్వడమే. అంతేకాదు శ్రీరామ్ స్థానంలో పరిటాల సునీతను వచ్చే ఎన్నికల్లో పోటీలోకి దింపాలన్నది చంద్రబాబు ఆలోచనట. ప్రస్తుతం రాప్తాడు నియోజకవర్గ బాధ్యతలను సునీత చూసుకుంటారు. అక్కడి నుంచే ఆమెని బరిలోకి దింపాలన్నది చంద్రబాబు వ్యూహమట. అంతేకాదు కుటుంబం నుంచి ఒక్కరికే టిక్కెట్ ఇవ్వాలని టిడిపి అధ్యక్షుడు ఇప్పటికే నిర్ణయించారట. అందుకే పరిటాల సునీత వైపే ఆయన మొగ్గు చూపుతున్నారట. అయితే సునీత మాత్రం తన కొడుక్కే మళ్లీ పోటీ చేసే అవకాశమివ్వాలని చంద్రబాబుకి మొరపెట్టుకున్నారట. జనసేన పార్టీ కూడా ఈనియోజకవర్గంలో బలపడటానికి ప్రయత్నాలు చేస్తోంది. ఆ పార్టీ జనరల్ సెక్రటరీ చిలకం మధుసూదనరెడ్డికి ప్రజల్లో మంచి పేరే ఉంది.

అధికారపార్టీతో ఢీ కొట్టే నేతగా చిలకం పేరు తరచూ వినిపిస్తుంటుంది. పవన్ కల్యాణ్‌కి కూడా ఈయనపై మంచి అభిప్రాయమే ఉంది. అందుకే వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున చిలకం ధర్మవరం నుంచి పోటీ చేయనున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. టిడిపి- జనసేన పొత్తు ఖరారైతే ధర్మవరం నుంచి పరిటాలకి అవకాశం ఉంటుందా లేదంటే చిలకం ఛాన్స్ కొట్టేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. ఇందులో ఎవరికి ఛాన్స్ ఇచ్చినా ఇంకొకరు పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే అవకాశాలు ఉంటాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ధర్మవరం అధికారపార్టీనేతగా కేతిరెడ్డి ఉన్నారు. గుడ్ మార్నింగ్ ధర్మవరం పేరుతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల్లో మంచి పేరే తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాబట్టి ఇప్పుడు కేతిరెడ్డిని ఓడించే నేత ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. అయితే పరిటాల శ్రీరామ్‌కి టికెట్ అంత ఈజీ కాదనీ, టిడిపి - జనసేన పొత్తు వుంటే చిలకం మధుసూదన్‌రెడ్డికే టికెట్ కన్ఫర్మ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నియోజకవర్గంలో టాక్.

## టీడీపీ అసమ్మతే... బీఆర్ఎస్ ప్లాన్....

నెల్లూరు, డిసెంబర్ 24, తెరాస స్థానంలో భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అవతరించింది. తెలంగాణ సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాలలో కాలు మోపేందుకు బీఆర్ఎస్ ను దేశవ్యాప్తంగా బలోపేతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఢిల్లీ కేంద్రంగా పార్టీ కేంద్ర కార్యాలయాన్నిఏర్పాటు చేయడంతో పాటు, పలు కమిటీలను సైతం నియమించారు. ఉత్తర్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి సీఎం కేసీఆర్ కు మద్దతు లభించడంతో ఆ రాష్ట్రాల్లో మద్దతు ఇచ్చే పార్టీలతో కలిపి బీఆర్ఎస్‌ను బలోపేతంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఇక సాటి తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోనూ త్వరలో బీఆర్ఎస్ కాలు మోపేందుకు సిద్ధమైంది. క్రిస్మస్ తరువాత ఏపీలో బీఆర్ ఎస్ కార్యకలాపాలను ప్రారంభించేలా కేసీఆర్ ఇప్పటికే ఓ ప్రణాళిక సిద్ధం చేశారు. ఆ ప్రణాళికలో భాగంగానే బీఆర్ఎస్ ఏపీ బాధ్యతలను మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ కు అప్పగించారుఏపీలో ప్రస్తుతం అధికార వైసీపీ, విపక్ష తెలుగుదేశం, జనసేన పార్టీలు బీజేపీకి అనుకూలంగానే ఉన్నాయి. ఈ క్రమంలో బీజేపీ వ్యతిరేక వర్గాన్ని కలుపుకొని బీఆర్ఎస్‌ను ఏపీలో విస్తరించాలని కేసీఆర్ భావిస్తున్నారు. క్రిస్మస్ తరువాత బీఆర్ఎస్ ఏపీ కిసాన్ సెల్ ను ఏర్పాటు చేయబోతున్నట్లు కేసీఆర్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే సీఎం కేసీఆర్‌తో ఉత్తరాంధ్రకు చెందిన రాజకీయ ప్రముఖులు, రైతు సంఘాల నేతలు, వివిధ సంఘాల నేతలు మంతనాలు జరిపినట్లు చెబుతున్నారు. వీరందరితో కలిపి కిసాన్ సెల్ కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా ఏపీలో అడుగు పెట్టాలని కేసీఆర్ ప్లాన్‌గా కనిపిస్తోంది. కేసీఆర్ ఏపీలో ముఖ్యంగా తెలుగుదేశం ను టార్గెట్ చేసే అవకాశాలు ఉన్నాయి. టీడీపీలోని కీలక నేతలతో కేసీఆర్‌కు ఎప్పటినుంచో మంచి సంబంధం ఉంది. ఈ క్రమంలో వారిలో కొందరిని బీఆర్ ఎస్‌లోకి తీసుకొస్తారన్న ప్రచారం తెలుగు రాష్ట్రాలలో గత కొంత కాలంగా జరుగుతోంది. క్రిస్మస్ తరువాత కేసీఆర్ నేరుగా ఏపీకి వెళ్లి కిసాన్ సెల్ ను ఏర్పాటు చేస్తారా? లేదా అక్కడి నేతలే కిసాన్ సెల్ గా ఏర్పాటవుతారా అన్న విషయంలో స్పష్టత లేదు. కానీ కేసీఆర్ ఏపీకి వస్తే రాజధానిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంటుంది. కేసీఆర్ ఏపీ రాజధానిపై ఓ స్పష్టతకు వచ్చారని అంటున్నారు. క్రిస్మస్ తరువాత కిసాన్ సెల్ ఏర్పాటుతో ఏపీలోకి ఎంట్రీ ఇవ్వనున్న కేసీఆర్.. జనవరి తరువాత భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో జోరుగా చర్చ జరుగుతుంది.

## విశాఖ నుంచి లక్ష్మీనారాయణ పోటీ



విశాఖపట్టణం, డిసెంబర్ 24, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో విశాఖ నుంచి లోక్ సభ సభ్యునిగా పోటీ చేయాలని నిర్ణయిచుకున్నారు. ఆయన స్వచ్ఛంద సంస్థ జాయిన్ ఫర్ డెవలప్‌మెంట్ జేడీ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పలు పార్టీలు జేడీ లక్ష్మీనారాయణకు ఆహ్వానం పలికాయని కానీ సిద్ధాంతాలు కలవకపోవడం వల్ల ఏ పార్టీలోనూ చేరకూడదని నిర్ణయించుకున్నారని ప్రకటించారు. విశాఖ నుంచే పోటీ చేస్తానని వీవీ లక్ష్మీనారాయణ కొంత కాలంగా చెబుతున్నారు. విశాఖపట్నం ప్రజలు తనకు ఎంతో ప్రేమ, ఆప్యాయత, గౌరవం ఇచ్చారని అందుకే మళ్లీ విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేయనున్నట్లు చెబుతున్నారు. తాను ఇండిపెండెంట్‌గా పోటీ చేసినప్పటికీ తన భావజాలానికి అనుకూలంగా ఉండే రాజకీయ పార్టీకి మద్దతుగా ఇస్తానని తెలిపారు. త్వరలో తన మేనిఫెస్టోను విడుదల చేయనున్నట్లు లక్ష్మీనారాయణ ప్రకటించారు. గత ఎన్నికల్లో జనసేన తరుపున విశాఖ నుంచి ఎంపీ స్థానానికి పోటీ చేసిన లక్ష్మీనారాయణ వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ చేతిలో ఓడిపోయారు. ఆ తరువాత కొన్ని రోజులు రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయన జనసేనకు రాజీనామా చేశారు. గతంలో సీబీఐ జేడీగా పని చేసిన లక్ష్మీనారాయణ వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. ఆ తరువాత పాలిటిక్స్ లోకి వచ్చారు. 2019 ఎన్నికల్లో లక్షీనారాయణకు 2,88,874 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ నుంచి పోటీ చేసిన బాలయ్య చిన్న అల్లుడు భరత్ కు 4,32,492 ఓట్లు పోలయ్యాయి. ఇక, వైసీపీ నుంచి పోటీ చేసిన ఎంవీవీ సత్యనారాయణకు 4,36,906 ఓట్లు రాగా, ఆయన విజయం సాధించారు. అ- ఈ సారి పొత్తులు ఖాయమని భావిస్తున్న వేళ..టీడీపీ - జనసేన కలిస్తే విశాఖ ఎంపీ సీటు కైవసం అవుతుందనే అంచనాలు రెండు పార్టీల నుంచి వినిపిస్తున్నాయి. కానీ, పొత్తు గురించి రెండు పార్టీల్లో అంతర్గతంగా చర్చ సాగుతున్నా.. అధికారికంగా మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. విశాఖ నుంచే పోటీ చేయాలనుకుంటున్న లక్ష్మీనారాయణ మళ్లీ జనసేనలో చేరుతారన్న ప్రచారం జరిగింది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా లక్ష్మీనారాయణ ఇప్పటికే కార్మికులకు మద్దతుగా ఏపీ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసారు. విశాఖ కేంద్రంగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇక, స్థానికంగా తన మద్దతు పెంచుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యక్తిగతంగా తనకు విశాఖలోని సమీకరణాలు కలిసి వస్తాయని లక్ష్మీనారాయణ అంచనాతో ఉన్నారు. అందుకే ఆయన ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగాలనే ఆలోచన చేస్తున్నట్లుగా చెబుతున్నారు.

## విశాఖ కేంద్రపాలిత ప్రాంతం....?

విశాఖపట్టణం, డిసెంబర్24 విశాఖను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ అంశం కేంద్రం పరిశీలనలో ఉందని ముమ్మర ప్రచారమవుతోంది. ఈనేపథ్యంలో విశాఖను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటిస్తారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. దీనిపై ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో కేంద్ర మంత్రుల మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. గతంలో తెలుగు రాష్ట్రాల విభజనకు ముందు కేంద్రంలోని ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాదును కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించాలనే సమాలోచనలు చేసింది. కానీ అది వాస్తవ రూపం దాల్చలేదు. మళ్లీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కీలక నగరంగా ఉన్న విశాఖపట్నంపై ఆ తరహా ప్రచారం జరుగుతుంది. విశాఖపట్నాన్ని ఎందుకు కేంద్రపాలిత ప్రాంతం చేయకూడదనే చర్చ ఢిల్లీలో కొనసాగుతున్నట్లు భోగట్టా. విశాఖలో పెద్ద ఎత్తున కేంద్ర సంస్థలు ఉండటం. త్రివిధ దళాలకు సంబంధించి కీలక కార్యాలయాలు ఉండటం, దీనికి తోడు సుధీర తీర ప్రాంతం కావడం. ప్రస్తుతం చైనా, పాకిస్తాన్ దేశాలతో శత్రుత్వంతో ఈ తీర ప్రాంతం ద్వారా విశాఖకు ముప్పు వాటిల్లే అవకాశం ఉండటం దృష్ట్యా బీజేపీ కేంద్ర ప్రభుత్వం విశాఖను కేంద్రపాలిత ప్రాంతంగా చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అంశానికి సంబంధించి ఇప్పటికే రాష్ట్ర బీజేపీ నాయకత్వం కూడా కేంద్ర ప్రభుత్వానికి తమ నిర్ణయం తెలియజేసినట్లు తెలుస్తుంది. రాష్ట్ర విభజన ద్వారా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకుంటామని విభజన హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చిన కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తే రాష్ట్రానికి మరింత మేలు జరుగుతుందని ఇక్కడ ప్రజలు ఎంతో ఆశించారు. ప్రస్తుత పరిస్థితిలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వం ఖరా ఖండిగా చెప్పేసింది. కేంద్రంపై ఈ విషయమే పోరాటం చేసే విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ముందుకు వెళ్లడం లేదు. స్వప్రయోజనాల కోసం ఈ పార్టీలు పెద్దగా ఏమీ చేయలేదని ప్రజలే విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో రాజధానుల రగడ కూడా కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధాని అని టీడీపీ, కాదు ఆంధ్రప్రదేశ్‌కు మూడు రాజధానులు వైసీపీ వాదించుకుంటున్నాయి. వైసీపీ ప్రభుత్వం విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా ఇప్పటికే ప్రకటించింది. పరిపాలన సౌలభ్యం కోసం, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే ఆలోచనతోనే మూడు రాజధానులు ఉండాల్సిందేనని వైసీపీ గట్టిగా చెబుతుంది. ఈ రచ్చ ఇలా కొనసాగుతుండగానే విశాఖను కేంద్రపాలిత ప్రాంతం చేయాలని మరో పక్క కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

# ఆచితూచి గంటా అడుగులు



గుంటూరు, డిసెంబర్ 24, డీపీ, పీఆర్పీ, కాంగ్రెస్ పార్టీలతో పెనవేసుకున్న నాయకుడు? గంటా శ్రీనివాస్‌రావు. గడచిన ఎన్నికల్లో వైసీపీ హవాను తట్టుకుని టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే గెలిచిన తర్వాత గంటా సీన్ మారింది. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో టీడీపీతో టచ్ మి నాట్‌గా ఉంటున్నారు. ఈ వైఖరి టీడీపీలోని గంటా ప్రత్యర్థులకు కలిసి వచ్చింది. అడపా దడపా టీడీపీ వేదికలపై మాజీ మంత్రి కనిపిస్తున్నా.. పార్టీ ఫ్లేవరుకు దూరమయ్యారనే ప్రచారం ఉంది. గంటా వైసీపీలో చేరిపోతారనే ప్రచారం ఈ మధ్య గట్టిగానే జరిగింది. ఆ దిశగా అడుగులు పడుతున్నాయో లేదో కానీ.. ఎక్కడున్న గంటా అక్కడే ఉన్నారు. అయినప్పటికీ ఆయనపై అనుమానపు నీడలు తొలగలేదు. ఈ మధ్య కాలంలో గంటా శ్రీనివాసరావు కాపు నినాదాన్ని భుజాన వేసుకున్నారు. దానిపై టీడీపీ వర్గాల్లోనూ ఆసక్తికర చర్చ జరుగుతోందిఈ నెల 26న కాపునాడు సమావేశం జరపాలని కాపు సామాజికవర్గానికి చెందిన పెద్దలు నిర్ణయించారు. ఆ సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖ కేంద్రంగా కాపునాడు కార్యక్రమం నిర్వహించాలని భావించినా.. అది విజయవాడకు మారే సూచనలు కన్పిస్తున్నాయి. ఇదే సమయంలో టీడీపీ నేతలను ఒక్కొక్కరిని గంటా కూడగట్టే ప్రయత్నం చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఇటీవల విజయవాడలో జరిగిన సమావేశం ఆ వ్యూహంలో భాగమేనట. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఆ సమావేశంలో పాల్గొన్నారు. రాత్రి పదిన్నరకు మొదలైన సమావేశం.. అర్ధరాత్రి తర్వాత కూడా కొనసాగింది. ఆ భేటీలో గంటా, బొండాతోపాటు కన్నా కూడా ఉన్నారు. ఆ సమావేశంపైనే టీడీపీలో విస్తృతంగా చర్చ జరుగుతోంది.ఇప్పుడున్న పరిస్థితుల్లో కాపు సామాజికవర్గ పరంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా.. అడుగులు వేయాలన్న ఆచితూచి వ్యవహరించాల్సి ఉంటుందని పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారట. కాపులను బూచిగా చూపించి.. బీసీలను వైసీపీ దగ్గర తీసుకునే ప్రయత్నం చేస్తోందనే వాదన టీడీపీలో ఉంది. టీడీపీలో కాపు నేతగా ఉన్న బొండా ఉమ.. పార్టీతో అంటీ ముట్టనట్టుగా ఉన్న గంటాతో భేటీ కావడం తప్పుడు సంకేతాలిస్తుందనే చర్చ జరుగుతోందట. దీనిపై బహిరంగంగా ఎవ్వరూ చెప్పకపోయినా.. ఆ సమావేశానికి ఉమా వెళ్లడాన్ని తప్పు పడుతూ గుసగుసలాడుతున్నారట.టీడీపీలోని మరికొందరు కాపు నేతలకు గంటా ఫోన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. వీలున్నప్పుడు భేటీ అవుదాం.. చర్చిద్దామని మాటలు కలుపుతున్నారట. అయితే బొండా ఎపిసోడుతో ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ ఏదో సాకు చెప్పి.. గంటా ఛాయల నుంచి తప్పించుకుంటున్నారట. పార్టీ అధినాయకత్వం ఈ తంతును సీరియస్‌గా తీసుకుంటే అసలుకే మోసం వస్తుందని ఆందోళన చెందుతున్నారట. ఇదే సమయంలో టీడీపీ కాపు నేతలకు మరో చిక్కొచ్చి పడింది. కాపు సంక్షేమం కోసం.. ఓ సమావేశం పెట్టుకుందామని ఆహ్వానిస్తే.. దానికి వెళ్లడం లేదనే ఫీలర్లు బయటకు వెళ్తే.. సొంత సామాజికవర్గంలోనూ.. కాపు ఓటర్లకూ సమాధానం చెప్పుకోలేని పరిస్థితి వస్తుందంటున్నారట. ఈ క్రమంలో టీడీపీ కాపు నేతల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైందట.

# తల్లిదండ్రుల ఆశయాలు, కష్టాలు గుర్తు తెచ్చుకుని సాధన చేస్తే ఉద్యోగాలు తథ్యం

## జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి

## అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పోలీసు పిల్లల కోసం మరో ఉచిత కోచింగ్ ప్రారంభం

అనంతపురంతల్లిదండ్రుల ఆశయాలు, కష్టాలు గుర్తు తెచ్చుకుని సాధన చేస్తే ఉద్యోగాలు తప్పకుండా సాధించవచ్చని జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి అభిప్రాయపడ్డారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పోలీసు పిల్లలు ఎస్సై/ కానిస్టేబుళ్ల ఉద్యోగాలలో రాణించేందుకు స్థానిక డిటిసిలో జిల్లా పోలీసుశాఖ సిద్ధం చేసిన ఉచిత కోచింగ్ సెంటర్ ను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మంచి ఫ్యాకల్టీతో కోచింగ్ ఇస్తున్నాం బాగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగాలు, విజయాలు వాటంతట అవే రావని... నిరంతర శ్రమ, కఠోర సాధనతోనే వస్తాయన్నారు. ఈ పోలీస్ రిక్రూట్మెంట్ పక్కాగా పారదర్శకంగా జరుగుతుందని... దళారులు, మోసగాళ్ల మాటల వలలో పడి ప్రత్యామ్నాయ మార్గాల వైపు వెళితే నష్టపోతారని సూచించారు. సమయపాలన, వ్యక్తిగత క్రమశిక్షణతో తర్ఫీదు తీసుకోవాలన్నారు. ఫిజికల్ ఈవెంట్స్ శిక్షణకు కూడా క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. పోలీసు ఉద్యోగాల నియామకపు పరీక్షల వ్యవధి తక్కువుగా ఉందని... దీన్ని దృష్టిలో ఉంచుకుని బాగా ప్రిపేర్ కావాలన్నారు. ఎస్సై ఉద్యోగాల పరీక్షల వరకు ప్రతీ రోజూ కోచింగ్ నిర్వహిస్తామని... జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఉన్న పోలీస్ క్యాంటీన్ , డిజిటల్ లైబ్రరీల సేవలు వినియోగించుకోవచ్చున్నారు. కాంపిటేటివ్ ఎగ్జామ్స్, స్టడీ సెంటర్ కమ్ డిజిటల్ లైబ్రరీలో ఇదివరకే సివిల్స్ , గ్రూప్స్ , బ్యాంకు, పదవ తరగతి ఫెయిల్ విద్యార్థులకు కోచింగ్ ఇవ్వడం... తాజాగా పోలీసు పిల్లలకు ఉచిత కోచింగ్ సెంటర్ ను ప్రారంభించడంతో పోలీసువర్గాల్లో హర్షం వ్యక్తమయ్యింది. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, హనుమంతు, స్పెషల్ బ్రాంచి సి.ఐ చక్రవర్తి, ఆర్ ఎస్ ఐ లు ప్రవీణ్ కుమార్ ,రాజశేఖర్ రెడ్డి, ప్రదీప్ సింగ్ , భాస్కర్ , జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, తేజ్ పాల్, శ్రీనివాసుల నాయుడు, ఆనందబాబు, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి ధ్వంసం

అనకాపల్లి అనకాపల్లిలో భారీగా గంజాయిని పోలీసులు ధ్వంసం చేశారు. ఆపరేషన్ పరివర్తనలో భాగంగా గంజాయి అక్రమ రవాణాలో పట్టుకున్న గంజాయిని విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ ధ్వంసం చేశారు. 929 కేసుల్లో పట్టుకున్న 1.93 లక్షల కేజీల గంజాయి, 133 లీటర్ల ఆశిష్ ఆయిల్కు నిప్పు అంటించారు. మార్కెట్ విలువ ప్రకారం 240 కోట్లు ఉంటుందని అంచనా. అనకాపల్లి జిల్లా శివారు ప్రాంతాలలో కోడూరు వద్ద రెండవ దఫా గంజాయి ధ్వంసం చేశారు. అనకాపల్లి, అల్లూరి, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు, సెబ్ అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే.గంజాయి అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడిన వాటిలో అల్లూరి, అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా కేసులు నమోదు అయ్యాయి.

# ప్రేమోన్మాది ఘాతుకం

కాకినాడ తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం రాత్రి ప్రేమోన్మాది విచక్షణరహితంగా జరిపిన దాడిలో ముగ్గురు గాయాల పాలై విషయం తెలుసుకుని హుటా హుటిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా,రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఉన్మాది దాడిలో గాయపడిన వారిని ప్రభుత్వ రాజమహేంద్ర వరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో స్వయంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా,రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆసుపత్రికి చేరుకుని ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడారు. ఇటువంటి చర్యకు కారుకుడైన ఉన్మాదిని వెంటనే అరెస్టు చేయాలని కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా,చందన నాగేశ్వర్ ఈ సంఘటనపై స్పందిస్తూ సమాజంలో ఇటువంటి సంఘటనలు మరల పునరావృతం కాకుండా ఉండాలంటే ముందుగానే అప్రమత్తంగా ఉండాలన్నారు.ప్రేమను తిరస్కరించారని ఉన్మాదులుగా మారుతున్న యువకులు,యువతులుపై పాశవికంగా దాడులు చేస్తూన్నారని, ఇటువంటి సంఘటనల పట్ల అమ్మాయిలు కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.తమను ఎవరైనా ఇబ్బంది పెడుతున్న ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటే సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే పోలీసులు వారిపై చర్య తీసుకుంటారని ఇటువంటి సంఘటనలు జరగకుండా ముందుగానే అడ్డుకట్టవేయ వచ్చునని ఆయన అన్నారు. ఈ తరహా దాడులకు దిగడం వలన యువకులు వారి విలువైన బంగారు భవిష్యత్తును నాశనం అవుతుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు.

# మళ్లీ కిలోల కొద్ది దొరికిన కుళ్ళిన మాంసాలు


నెల్లూరు నెల్లూరు నగరం లో భారీగా కుళ్ళిన మాంసం విక్రయాలు, చుట్టుపక్కల వారి సమాచారంతో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఆధ్వర్యంలో దాడులు చేసి కుళ్ళిన మాంసాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.నెల్లూరు నగరంలోని హరినాధపురం సెంటర్లో ఒక అంగడిలో దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల ప్రజలు ఈ సమాచారం నెల్లూరు నగర మున్సిపల్ ఆరోగ్య విభాగం అధికారులకు చేరవేసారు. దాంతో అక్కడకు చేరుకున్న హెల్త్ అధికారి వెంకటరమణ తన సిబ్బందితో ఆ షాప్ లో తనిఖీలు చేయగా భారీగా కుళ్ళిన మాంసం నిల్వలు బయటపడ్డాయి దీంతో షాప్ యజమానిని ప్రశ్నించడంతో బయట ప్రాంతాల నుంచి చికెన్ తీసుకువచ్చి నెల్లూరు నగరంలో పలు హోటల్స్ షాపులకు విక్రయిస్తుంటారని తెలియజేశాడు. గతంలో కూడా చెన్నై నుంచి చికెన్ వ్యర్థాలు తీసుకొచ్చి నెల్లూరులోని పలు హోటల్స్ కి సరఫరా చేసిన సంఘటనలు కూడా చూసాము, అక్రమార్కులు కుళ్ళిన మాంసాలు అమ్మడం మానుకోవడం లేదు, ఇటువంటి వారిపై కఠిన శిక్షలు అమలు చేయాల్సిన అధికారులు తూతూ మంత్రంగా ప్రజలు సమాచారం ఇస్తే తనిఖీలు చేయడం మిగతా సమయాల్లో అక్రమార్కులు దగ్గర సొమ్ము చేసుకుంటున్నారని అపవాదు కూడా ఉంది, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రజలకు హాని కలిగించే ఇటువంటి కుళ్ళిన మాంసం సరఫరా విక్రయదారులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని అలాగే నెల్లూరు నగరంలో ఎక్కడపడితే అక్కడ కుప్పలు తిప్పలుగా వెలుస్తున్న అనుమతులు లేని హోటల్స్ మరియు ఆహారపు సముదాయాలు వున్నా కనీసం కన్నెత్తి చూడని మున్సిపల్ అధికారులు ప్రజల ఆరోగ్యానికి రక్షణ లేకుండా పోయిన దుస్థితి.

# ఉత్తరాంధ్రకు చంద్రబాబు ఏం చేసారు

విశాఖపట్నంఉత్తరాంధ్రకు వచ్చి చంద్రబాబు అనేక విమర్శలు చేస్తున్నారని, తెలంగాణలో వాటిని చూపించడానికి ఒక ప్రయత్నం చేస్తున్నట్లు మంత్రి గుడివాడ అమర్నాథ్ విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రజల కోసం బాబు చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ వల్లే విశాఖ బ్రాండ్ ఇమేజ్ పెరిగినట్లు మంత్రి తెలిపారు.వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మూడున్నర సంవత్సరాలుగా.. టీడీపీని, చంద్రబాబును జనం విశ్వసించడం లేదని మంత్రి గుడివాడ అమర్నాథ్ విమర్శించారు. ఉత్తరాంధ్రకు వచ్చి చంద్రబాబు అనేక విమర్శలు చేస్తున్నారని,.. తెలంగాణలో వాటిని చూపించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు మంత్రి ఎద్దేవా చేశారు. విశాఖలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు రాజాంలో పర్యటిస్తూ, ఉత్తరాంధ్రకు ఏం చేశారో చెప్పాలన్నారు. 1995లో ముఖ్యమంత్రి అయి ఆయన ఏం చేశారని ప్రశ్నించారు. విశాఖ పరిపాలన రాజధానిగా.. వ్యతిరేకించినందున ఈ ప్రాంతం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు.జనవరి నుంచి ఏప్రిల్ వరకూ అంతర్జాతీయ సదస్సులు విశాఖలో జరగనున్నాయని, విశాఖ బ్రాండ్ ఇమేజ్ను ఈ స్థాయికి తెచ్చిన ఘనత జగన్ మోహన్రెడ్డికి దక్కుతుందని చెప్పారు.

# నేడు భారత మాజీ ప్రధాని భారతరత్న వాజ్ పాయ్ జయంతి

## -సుపరిపాలన దినోత్సవం



అటల్ బిహారీ వాజపేయి డిసెంబర్ 25 1924న మధ్య ప్రదేశ్ లోని గ్వాలియర్ లో జన్మించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి భారతీయ జనతా పార్టీ తరపున ప్రధాన మంత్రి పదవిని పొందిన నాయకుడు. ఈయన బ్రహ్మచారి. ఇతను మొదటిసారిగా రెండవ లోక్‌సభ కు ఎన్నికైనారు. మధ్యలో 3వ మరియు 9వ లోక్‌సభలకు తప్పించి 14వ లోక్ సభ ముగిసేవరకు పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించారు. ఆయన రెండుసార్లు రాజ్యసభకు కూడా ఎన్నికైనారు. 1968 నుండి 1973 వరకు జనసంఘ్ పార్టీ కి అధ్యక్షుడిగా పనిచేసి, 1980 నుండి 1986 వరకు భారతీయ జనతా పార్టీకి వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేశారు. 1996 లో తొలిసారిగా ప్రధానమంత్రి పదవి యోగం లభించినా అది 13 రోజులకే పరిమితమైంది. 1998 లో రెండో పర్యాయం ప్రధానమంత్రి పదవి పొంది 13 మాసాలు పాలించారు. 1999 లో 13వ లోక్‌సభ ఎన్నికల అనంతరం మరోసారి ప్రధానమంత్రి పదవి చేపట్టి 2004 వరకు పదవిలో ఉన్నారు. అలుపెరుగని ఈ రాజకీయ నాయకుడికి 1994 లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు లభించింది. మొదటి కాంగ్రేసేతర ప్రభుత్వమైన మొరార్జీ దేశాయ్ మంత్రివర్గంలో విదేశీ వ్యవహారాల శాఖను నిర్వహించారు. ఆయన అనారోగ్య కారణాలవళ్ళ క్రియాశీల రాజకీయాలనుండి తప్పుకున్నారు. ఆయన దేశానికి చేసిన విశేష సేవలకు గానూ భారత ప్రభుత్వం డిసెంబర్ 24, 2014 లో భారతరత్న పురస్కారాన్ని ప్రకటించారు. ఆయన పుట్టినరోజు అయిన డిసెంబర్ 25 ను సుపరిపాలనా దినం గా భారత ప్రభుత్వం ప్రకటించింది. వాజ్‌పేయీకి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' మార్చి 27 2015 న ప్రదానం చేశారు. అనారోగ్యంతో పూర్తిగా మంచంపై ఉన్న వాజ్‌పేయీకి భారత రత్న ప్రదానం చేయడానికి స్వయంగా రాష్ట్రపతే వాజ్‌పేయీ నివాసానికి తరలి వచ్చారు.ఈయన ఆగస్టు 16, 2018 న తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో మృతి చెందారు.

# మాట తప్పావు మడం మడమ తిప్పావు

## - దిగిపో జగన్ అంటున్న జనసేన నేతలు



నెల్లూరు మాట తప్పావు- మడమ తిప్పావు .దిగిపో జగన్ అంటూ- జగన్ మాట తప్పిన 100 మాటలు ప్లకార్డులతో జనసేన పార్టీ నెల్లూరులో నిరసన కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు.3 దగ్గరే ఆగిపోయి రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసారు జగన్-అంటూజనసేన పార్టీ నెల్లూరు నాయకులు గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ని విమర్శించడం పై శనివారం మధ్యాహ్నం గం 12.00ని లకు గాంధీ బొమ్మ సెంటర్ నందు నిరసన కార్యక్రమం చేపట్టారు.ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి మరచిపోయిన జగన్ తప్పిన మాటల ప్లక్కార్డులను 100కు పైగా ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట తప్పడం మడం తిప్పడం అలవాటైపోయిన జగన్ దాదాపు 100 మాటలు పైగా నిలబెట్టుకోలేకపోయాడు.రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలి మూడు పెళ్లిళ్ల దగ్గర ఆగిపోయిన అతని కుటుంబంలో,ఎవరెవరికి ఎన్ని పెళ్లిళ్లు జరిగాయో మాకు తెలుసు సంస్కారహీనంగా మాట్లాడటం మా నాయకులకు తెలియదు అందుకే సహనం వహిస్తున్నారని తెలిపారు.ప్రజల మద్దతు లేకుండా ఈసారి 175 అని కలలు కంటున్న మీకు 50 సీట్లు దక్కడం కూడా కష్టమే అని తెలిపారు.ఎన్నికల ముందు అవ్వా,తాతా,అక్కా,అన్నా అంటూ ఊరూరు తిరిగిన జగన్ గెలిచిన తర్వాత ప్రజల్లో కనపడటమే కష్టం అయిపోయింది.ఎక్కువ సీట్లు గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెప్పిస్తానన్న జగన్ ఇప్పటికి రాజధాని కూడా ఏర్పరచలేకపోయారు.సంస్కారహీనంగా వ్యక్తిగతంగా దుర్భాషలాడుతున్న జగన్ కి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారు.మాట తప్పావ్ మడం తిప్పావ్ దిగిపో జగన్ అని నినాదాలు చేశారు.విద్యార్థులకు స్కాలర్షిప్పుల్లేవు.యువతకు ఉద్యోగ అవకాశాల్లేవ్.ఉద్యోగస్తులకు జీతాల్లేవ్.కొత్త పరిశ్రమలకు రాయితీల్లేవ్.వృద్ధులకు వైద్య సౌకర్యాలు లేవు. అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలన్నా రాష్ట్ర అభివృద్ధి చెందాలన్నా జనసేన పార్టీ గాజుగ్లాసు కి ఓటు వేసి పవన్ కళ్యాణ్ ని గెలిపించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులకు గునుకుల కిషోర్ తో పాటు కొండ్రెడ్డి , హేమంత్ , షాజహాన్ , ఇంతియాజ్ , రాజా,మౌనేష్,బాలు,వర,వెంకీ,వినోద్, శ్రీకాంత్,బన్నీ,శంకర్,మల్లీ,తదితరులు పాల్గొన్నారు..

# ఇయర్ ఎండింగ్ లో అటు జగన్ ఇటు బాబు..

## అక్కడే ఫోకస్

అమరావతి డిసెంబర్ 24 కొద్ది రోజులు గడిస్తే చాలు కొత్త ఏడాదితో సరికొత్తగా క్యాలెండర్ స్టార్ట్ అవుతుంది. ఇదిలా ఉంటే 2022లో కరోనా బాగా తగ్గి భారీ ఊరట ఇవ్వడంతో ఏపీ రాజకీయం అంతా జనాల చెంతకు చేరింది. ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కే కార్యక్రమాన్ని తన తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ నుంచి జిల్లాల దాకా తీసుకువచ్చారు. భారీ సభలు పెట్టి జనం మధ్యలో బటన్ నొక్కి ఇదిగో మీ నగదు అంటూ ఖాతాలలోకి నేరుగానే వేస్తున్నారు.ఈ సందర్భంగానే జగన్ తాను ప్రభుత్వం చేసే మంచిని చెప్పాలనుకుంటునంది విపక్షాలను విమర్శించాలనుకుంటున్నదీ కూడా అన్ని చెబుతున్నారు. ఒక విధంగా జగన్ ప్రభుత్వ సభలలోనే తన పార్టీ గురించి నాలుగు మంచి మాటలు చెప్పుకుంటున్నారు. ఎన్నికల ప్రచారాన్ని కూడా అలా చేసుకుంటూ వస్తున్నారు. మరి చంద్రబాబు ఊరుకుంటారా. ఆయన కూడా జిల్లాల టూర్లు చేస్తున్నారు. అన్ని చోట్లా ఆయన హడావుడిగా తిరుగుతున్నారు.ఏపీ సర్కార్ బడాయి కబుర్లు అంటూ జనంలోనే వైసీపీ గుట్టు బయటపెడుతున్నారు. 2022లో బాదుడే బాదుడు అంటూ స్టార్ట్ చేసి అన్ని జిల్లాలు తిరిగిన బాబు ఏడాది చివరకు వచ్చేసరికి ఇదేమి ఖర్మ అంటూ మరో కార్యక్రమాన్ని ఎత్తుకున్నారు. దాంతో జిల్లాల పర్యటనలు చేస్తూ వస్తున్నారు. ఇక బాబు ఏపీలో ఉన్న రాయలసీమ కోస్తా గోదావరి జిల్లాలలో టూర్లతో పాటు ఇయర్ ఎండింగ్ లో ఉత్తరాంధ్రాను ఎంచుకున్నారు.మూడు రోజుల విజయనగరం జిల్లా టూర్ ను బాబు పెట్టుకుని జగన్ సర్కార్ మీద హాట్ హాట్ కమెంట్స్ చేస్తూ వస్తున్నారు. ఏపీలో సైకో పాలన అంతం కావాలని సైకిల్ పాలన తిరిగి రావాలని ఆయన ప్రజలకు పిలుపు ఇస్తున్నారు. వచ్చేది మన ప్రభుత్వమే అంటున్నారు. ఉత్తరాంధ్రా టీడీపీకి కంచుకోట. కాబట్టి ఇక్కడ నుంచే గేర్ మార్చి స్పీడ్ పెంచాలని బాబు చూస్తున్నారు.ఇక జగన్ కూడా విశాఖ శ్రీకాకుళం జిల్లాలకు ఈ ఏడాదితో అనేక సార్లు వచ్చారు. అనేక కార్యక్రమాలలో పాలు పంచుకున్నారు. ఈ ఏడాది ఎండింగ్ లో ఫైనల్ టచ్ ని ఆయన ఉత్తరాంధ్రాలో ఇస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా నర్శీపట్నంలో ఎనిమిది వందల కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను జగన్ ఈ నెల 28న తన జిల్లా టూర్ లో శ్రీకారం చుడుతున్నారు.అలాగే నర్శీపట్నంలో ఆ రోజున మెడికల్ కాలేజీకి ఆయన శంకుస్థాపన చేయనున్నారు. సాగునీటి ప్రాజెక్టులకు కూడా శ్రీకారం చుట్టనున్నారు. మొత్తానికి అటు జగన్ కానీ ఇటు బాబు కానీ 2022 చివరల్లో లాస్ట్ పంచ్ అన్నట్లుగా ఉత్తరాంధ్రాకే అధిక ప్రయారిటీ ఇవ్వడం విశేషం.

# ప్రత్యేక రాయలసీమ ఉద్యమం

తిరుపతి, డిసెంబర్ 24, (న్యూస్ పల్స్)రాయలసీమ హక్కుల సాధన కోసం మరోసారి పోరాటానికి సిద్ధమవుతున్నారు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి. సంక్రాంతి ఫెస్టివల్ తర్వాత రాయలసీమ మొత్తం తిరిగి, సీమ వాసులకు జరుగుతోన్న అన్యాయాన్ని వివరిస్తానంటున్నారు. నీళ్లు నిధులు ఉద్యోగాలే లక్ష్యంగా కర్నూలులో రాయలసీమ మేధావుల సదస్సు నిర్వహించారు బైరెడ్డి. రాయలసీమకు న్యాయ రాజధాని ముఖ్యంకాదన్నారు ఆయన. నీళ్లు, నిధులు, ఉద్యోగాలు వస్తేనే రాయలసీమ దరిద్రం తీరుతుందంటున్నారు.శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో ఎప్పుడో రాజధాని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు బైరెడ్డి. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు అంటూ ప్రజలను కన్ఫ్యూజ్ చేస్తోందని మండిపడ్డారు. రాయలసీమ పరిరక్షణ సమితి ఏర్పాటు చేసినప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చినా, దాన్ని ఓట్ల రూపంలో మార్చుకోలేకపోయామన్నారు బైరెడ్డి. ఇప్పుడు, రాయలసీమ ప్రజలు డిమాండ్ చేస్తే పార్టీ పెడతానంటూ సంకేతాలు ఇచ్చారు. రాయలసీమ సమస్యలపై త్వరలో ప్రధాని మోదీని కలవబోతున్నట్లు తెలిపారు బైరెడ్డి.

# ఆంధ్రప్రదేశ్ లో మరోసారి కాపు చిచ్చు!

అమరావతి డిసెంబర్ 24 ఆంధ్రప్రదేశ్ లో మరోసారి కాపు చిచ్చు రగిలే అవకాశం ఉంది. రిజర్వేషన్ల విషయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ ఎంపీ కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి వెంకట హరిరామ జోగయ్య లేఖ రాశారు. గతంలో చంద్రబాబు హయాంలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ప్రయత్నించారని కానీ ఇప్పటి ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని విమర్శించారు. ఈ విషయంలో ఈ నెలాఖరు వరకు అనుకూల నిర్ణయం తీసుకోవాలని లేకుంటే నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. ఏపీలో మరో ఏడాదిలో ఎన్నికలు జరగనున్న వేళ కాపు రిజర్వేషన్ల అంశం తెరపైకి రావడంపై తీవ్ర చర్చ సాగుతోంది. అయితే ప్రభుత్వం మాత్రం ఈ విషయంపై న్యాయ పరమైన చిక్కులు ఉన్నాయన్నారు. మరోవైపు కాపులు బీసీలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అందుకు సరైన నిర్ణయం తీసుకుంటామని చెబుతోంది.ఏపీ రాజకీయాల్లో కాపు ఓటర్లు కీలకం. 15 శాతం ఓటు బ్యాంకు వారిదే ఉంది. అత్యధిక కాపులు ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో 2019లో వైసీపీకి 34 సీట్లు వచ్చాయి. అందుకు ఆయన వారికి ఇచ్చిన హామీలే కారణమని తెలుస్తోంది. దీంతో కాపులను అక్కున చేర్చుకునేందుకు మిగతా రాజకీయ పార్టీలు సైతం వారికి అనుకూల హామీలు ఇస్తున్నాయి. కానీ ఏ పార్టీ రిజర్వేషన్ల అంశం తేల్చడం లేదని కాపులు ఆరోపిస్తున్నారు. కాపులకు రిజర్వేషన్లపై ఎన్నో ఏళ్లుగా ఉద్యమాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కాపులకు న్యాయం చేయాలని భావించిన అప్పటి సీఎం చంద్రబాబు 2017లో ఈ వర్గానికి 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో ఆమోద నిర్ణయం తీసుకున్నారు. అయితే సుప్రీం కోర్టు ఈ నిర్ణయానికి అడ్డుకట్ట వేసింది.అంతకుముందు కాపులకు రకరకాల హామీలు ఇచ్చిన వైసీపీ 2019లో అధికారంలోకి వచ్చాక ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మరో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాజాగా హరిరామ జోగయ్య రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయడం సంచలనంగా మారింది.

# రాజకీయ భీష్ముడు అపర రాజకీయ చాణిక్యుడు వీరారెడ్డి



## నేడు ఆయన 22వ వర్ధంతి

### రాజకీయాలకతీతంగా తరలివస్తున్న నేతలు

బద్వేలు జిల్లా రాజకీయాలను 22 సంవత్సరాల క్రితం వరకు శాసించిన దివంగత మాజీ మంత్రి బిజీ వేముల వీరారెడ్డి వర్ధంతి వేడుకలు ఆదివారం బద్వేల్ లో ఘనంగా జరుగునున్నాయి ఇందుకు తగిన ఏర్పాట్లు ఆయన కూతురు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మనవడు తెలుగుదేశం పార్టీ యువనేత రితేష్ కుమార్ రెడ్డిలు దగ్గరుండి చేస్తున్నారు వర్ధంతి వేడుకలకు పార్టీ చెందిన ముఖ్య నాయకులతో పాటు వీరారెడ్డి వ్యక్తిగత అభిమానులు ఆయన వర్ధంతి వేడుకలకు రానున్నారు సరిగ్గా 22 సంవత్సరాల క్రితం ఉమ్మడి రాష్ట్ర మంత్రి హోదాలో వీరారెడ్డి మృతి చెందారు అప్పటినుండి వీరారెడ్డి వర్ధంతి వేడుకలు ఆయన కుమార్తె మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు ఆయన గుర్తుగా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు పండుగ వాతావరణం లో వీరారెడ్డి వర్ధంతి వేడుకలు జరుగునున్నాయి వీరారెడ్డి గురించి ఒక్క మాటలో చెప్పాలంటే ఆయనకు రాజకీయాలు తప్ప మరో వ్యాపకం తెలియదు పంచాయతీ బోర్డు సభ్యుల నుంచి రాష్ట్ర మంత్రిగా ఆయన ఎదిగారు ఉమ్మడి రాష్ట్రంలో ఆయన మూడుసార్లు మంత్రిగా పనిచేశారు మంత్రిగా ఉంటూనే తనువు చాలించారు వీరారెడ్డి మృతి చెందిన విషయం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా ఒక్క కుదుపు కుదిపేసింది ఇంటిపేరు కంటే బద్వేల్ వీరారెడ్డి గా అందరూ ఆయన గుర్తుపెట్టుకున్నారు తెలుగుదేశం పార్టీ స్థాపన జరిగినప్పుడు ఎన్టీఆర్ గాలి విపరీతంగా వీస్తున్నప్పుడు బద్వేల్ అసెంబ్లీ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి అప్పట్లో మూడు వేలకు పైగా మెజార్టీతో విజయం సాధించారు ఎన్టీఆర్ వీరారెడ్డిని ప్రత్యేకంగా అప్పట్లో అభినందించారు ఎన్టీఆర్ను నాదెండ్ల భాస్కరరావు గద్దించినప్పుడు స్వతంత్ర ఎమ్మెల్యేగా ఉన్న వీరారెడ్డి ఎన్టీఆర్ వైపు నిలిచారు ఆ తరువాత ఎన్నికల్లో వీరారెడ్డి బద్వేల్ అసెంబ్లీ నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు అప్పటినుంచి మృతి చెందే వరకు వీరారెడ్డి తెలుగుదేశం పార్టీలోనే ఉన్నారు నీతి నిజాయితీలకు మారుపేరుగా వీరారెడ్డి నిలిచారు 22 సంవత్సరాల క్రితం డిసెంబర్ 25వ తేదీ తెల్లవారుజామున మృతి చెందారు వీరారెడ్డి రాజకీయ జీవితం ప్రతిరోజు తెల్లవారుజామున నాలుగు గంటలకు మొదలవుతుంది తిరిగి రాత్రి 11 గంటల వరకు తన అనునయునులతో రాజకీయ చర్చలు సాగిస్తూ ఉంటారు ఇలా ప్రతిరోజు వీరారెడ్డికి నిత్య కృత్యంగా మారింది రాష్ట్ర మంత్రిగా ఉ న్నప్పటికీ ఆయన దృష్టి మొత్తం బద్వేల్ నియోజకవర్గ అభివృద్ధిపైనే ఉ ండేదిఆయనను దగ్గర నుండి చూస్తే గంభీరంగా కనిపిస్తారు కానీ మెత్తని మనసత్వం ఆయనది ఎవరికైనా మాట ఇస్తే ఆ పని పూర్తయ్యే వరకు ఆయన నిద్రపోరు క్రమశిక్షణకు మారుపేరు వీరారెడ్డి సమయపాలనకు ఆయన ఎక్కువ విలువిస్తారు ఏదైనా కార్యక్రమం ఉంటే అర్ధగంట ముందు ఉంటారు అది ప్రభుత్వ కార్యక్రమమైన ప్రైవేట్ కార్యక్రమం అయిన అర్ధగంట ముందు హాజరవుతారు బద్వేల్ ప్రాంత రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వద్ద పట్టు పట్టి బ్రహ్మం సాగర్ తెలుగు గంగ రిజర్వాయర్కు శంకుస్థాపన చేయించారు ఇది కూడా వీరారెడ్డి జీవితంలో మచ్చుతునక అని చెప్పాలి వీరారెడ్డి అంటే ఉడుము పట్టు అనే పేరు ఇప్పటికీ ఉంది రాజకీయాలకు అతీతంగా వీరారెడ్డిని పలువురు అభిమానించేవారు వీరారెడ్డి దయతో ఎంతోమంది రాజకీయంగా ఉన్నత పదవులు పొందారు ఈ విషయాన్ని పదవులు పొందిన వారు కూడా ఇప్పటికీ అంగీకరిస్తారు వీరారెడ్డి 22వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థాపించిన విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఆయన కుమార్తె మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మనవడు తెలుగుదేశం పార్టీ యువనేత రితేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు అట్టహాసంగా జరుగునున్నాయి

# నంద్యాల జిల్లా ముస్లిం హక్కుల పోరాట సమితి కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీలపై జరుగుతున్న దాడులు అరికట్టాలి

## నరసరావుపేటలో హత్యకు గురైన షేక్. ఇబ్రహీం మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి ఎస్ ఎం డి యూనుస్ ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి

నంద్యాల డిసెంబర్ 24 నంద్యాల ముస్లిం హక్కుల పోరాట సమితి కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో.. షేక్.ఇబ్రహీం కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకి బదిలీ చేసి,నిందితులను కఠినంగా శిక్షించాలప్రశ్నించే వ్యక్తులపై దాడులు,హత్యాల సిగ్గ, సిగ్గచేటు నరసరావుపేటలో మసీదు విషయంలో హత్యకు గురైన షేక్. ఇబ్రహీం హత్యకు జరిగింది. ఈ సందర్భంగా ఎస్ ఎం డి యూనుస్ ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ, గత 3 రోజుల కింద నరసరావుపేట లో మసీదు విషయంలో హత్యకు గురైన షేక్. ఇబ్రహీం మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని,షేక్.ఇబ్రహీం మృతి కేసు వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ కు బదిలీ చేయాలని, షేక్. ఇబ్రహీం కుటుంబానికి కోటి రూపాయల ఎక్సగ్రేషియా చెల్లించాలని,మృతికి గురైన షేక్. ఇబ్రహీం అంజుమాన్ కమిటీ స్థలంలో మసీదు నిర్మించకుండా కేవలం కాంప్లెక్స్ మాత్రమే నిర్మించేందుకు సరి కాదని కోర్టు లో రిట్ పిటిషన్ దాఖలు చేయగా స్థానిక ఎమ్మెల్యే అనుచరులు ఒక పక్క పోలీసులతో వత్తడి తెస్తూనే మరో పక్క చర్చలకు పిలిపించి హత్య గావించడం దారుణమైన సంఘటన అని రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరు దీనిని ఖండించాలన్నారు, ,రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ,బీసీ లపైన దాడులు అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని,ముస్లిం ల పేరు పెట్టుకొని,ముస్లిం ప్రజల మీద పదవులు తెచ్చుకున్న ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,రాష్ట్ర అధికార పార్టీ నాయకులు ఎవ్వరు ఖండించకపోవడం దారుణమని వారు తెలిపారు.

# నందికొట్కూర్ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు మిడ్తూతూరు మండలంలో పర్యటన

నంద్యాల తెలుగుదేశం పార్లమెంట్ ఇంచార్జ్ శ్రీగౌరువెంకట్ రెడ్డి ,ఆదేశాల మేరకు ఇదేం కర్మ, రాష్ట్రానికి భాగంగా మిడ్తూతూరు. మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్, కాతా. రమేష్ రెడ్డి,ని నందికొట్కూరు తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంటేపోగు జయాకర్, మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైసీపీ పాలనలో మైన్ ,వైన్, ఇసుక, భూ కబ్జా, మాఫియా పెట్రేగిపోతున్నాయని అన్నారు. రాష్ట్రాభివృద్ధి శూన్యమని, పేద ప్రజలపై ఏడాపెడా చార్జీలు పెంచి ఖజానా నింపుకుంటున్నారని ధ్వజమెత్తారు .అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉ న్నారని తెలిపారు .ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించలేని ఈ ప్రభుత్వానికి పాలించే అర్హత లేదన్నారు. టిడిపికి ఓటు వేసి వచ్చే ఎన్నికలలో వైసీపీకి బుద్ధి చెప్పాలని ,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కొట్కూర్ తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ ఎం.ఖల్లిలుల్లా బేగ్, సీఎం.మాబేగ్, చంద్రకంటి అనిల్ కుమార్, బీసీ నాయకులు వడ్డే ఎల్లప్ప, లక్ష్మీనారాయణ, మరియు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే నందికొట్కూరు నియోజకవర్గ క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# సమస్యల పరిష్కారానికి అసోసియేషన్

నంద్యాల :- నంద్యాల జిల్లా మరియు నంద్యాల యు ఎల్ బి కి సంబంధించి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగస్తుల సంక్షేమం మరియు సమస్యల పరిష్కారం కొరకు గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ (రిజిస్టర్ నెంబర్ 13/2020 రిజిస్ట్రేషన్ చేయించారు . రిజిస్ట్రేషన్ పత్రాలను శనివారం నాడు . నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి కి , మునిసిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి కి. చైర్ పర్సన్ మాబున్నిసా కు . అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ కు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశి వారి చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించారు . నంద్యాల యు ఎల్ బి కి సంబంధించిన అధ్యక్షులుగా శ్రీ డి మక్బుల్ హుస్సేన్. ఉపాధ్యక్షులుగా శ్రీ పి జగదీశ్వర్ రావు. మరియు కే మధుసూదన్ రెడ్డి. జనరల్ సెక్రటరీలుగా శ్రీ శరత్ మొత్తం 30 మంది తో సభ్యులతో అసోసియేషన్ ను లాంచనంగా ఎర్పాటు చేసారు . ఈ కార్యక్రమానికి డిస్టిక్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె వెంకట్ . మరియు స్టేట్ జాయింట్ సెక్రటరీ బి రవి. జిల్లా ప్రతినిధులు హాజరయ్యారు . ఈ అసోసియేషన్ రాష్ట్రస్థాయిలో ఉద్యోగస్తుల సంక్షేమం కాకర్ల వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహింపబడుతున్న గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ అసోసియేషన్ (రిజిస్టర్ నెంబర్ 13/2020) కు అనుబంధంగా ఏర్పాటు చేశారు .

# బిప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరు డిసెంబర్24- శనివారం రోజువైఎస్సార్సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మిగనూరు పట్టణంలో ఉప్పర కళ్యాణ మండపంలో నందవరం మండల వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" మాట్లాడుతూ వివిధ రూపాల్లో ప్రభుత్వం అందజేస్తున్న సేవలను ఇంటింటికి తిరిగి ప్రజలకు తెలియజేయడంతో పాటు ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలని, ఇందుకు ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లను నియమించడం జరుగుతుందన్నారు. ఎన్నుకోబడిన వారు పార్టీ కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గత టీడీపీ హయంలో పేదలకు ప్రభుత్వ ఫలాలు అందలేదన్నారు.

# రంగమార్తాండకు చిరు వాయిస్ ఓవర్




గతం ఎంత ఘనంగా ఉన్నా ఇప్పుడు విజయాలు లేకపోతే చిత్రసీమలో ఎవరూ పట్టించుకోరు. ప్రస్తుతం క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ పరిస్థితి అలాగే ఉంది. ఇలాంటి సమయంలో ఈ దర్శకుడి ఆశలన్నీ రంగమార్తాండ సినిమాపైనే ఉన్నాయి. మరాఠీలో మంచి విజయం సాధించిన నట సామ్రాట్ సినిమాను తెలుగులో రంగమార్తాండ పేరుతో రీమేక్ చేస్తున్నాడు కృష్ణవంశీ. బ్రహ్మానందం, ప్రకాష్ రాజ్, రమ్యకృష్ణ లాంటి సీనియర్స్ ఇందులో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తికావడంతో ప్రమోషన్ మొదలుపెట్టాడు. దీనికోసం మెగాస్టార్ చిరంజీవిని తీసుకొచ్చాడు. చిరంజీవితో ముందు నుంచి కృష్ణవంశీకి మంచి అనుబంధం ఉంది. కృష్ణవంశీ ఫామ్ లో లేని సమయంలో కూడా రామ్ చరణ్ తో గోవిందుడు అందరివాడేలే సినిమా చేసే అవకాశం ఇచ్చాడు. మళ్లీ ఇప్పుడు రంగమార్తాండ సినిమా కోసం నేనొక నటుడుని.. అంటూ సాగే షయరీకి వాయిస్ ఓవర్ ఇచ్చాడు మెగాస్టార్. 4 నిమిషాలకు పైగా ఉన్న ఈ కవితకు అద్భుతమైన రెస్పాన్స్ వస్తుంది. ఎన్నో చిత్రాలకు చిరంజీవి వాయిస్ ఓవర్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. తాజాగా దర్శకుడు కృష్ణవంశీ కోసం ఆయన మరోసారి తన గళాన్ని వినిపించారు. థియేటర్ ఆర్టిస్టుల జీవితం ఆధారంగా కృష్ణవంశీ రూపొందిస్తోన్న చిత్రం 'రంగమార్తాండ'. ప్రకాష్ రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఇళయరాజా సంగీతం అందించారు. ఈ సినిమా కోసం లక్ష్మి భూపాల రాసిన 'నేనొక నటుడ్ని' అనే షాయరీకి తన గొంతుతో ప్రాణం పోశారు చిరంజీవి. ' నేనొక నటుడ్ని, చప్పట్లను భోంచేస్తూ, ఈలలను శ్వాసిస్తూ, అనుక్షణం జీవించే అల్పసంతోషిని నేను, మీ అంచనాలు దాటే ఆజానుబాహుడ్ని, సంచలనాలు సృష్టించే మరో కొత్త దేవుడ్ని, రాబోయే కాలంలో రాయబోయే చరిత్ర నేను, పూటపూటకూ రూపం మార్చుకునే అరుదైన జీవిని నేను' అంటూ సాగిన షాయరీ ఓ నటుడి జీవితానికి అక్షర రూపం ఇచ్చినట్టుగా సాగింది. ముఖ్యంగా చిరంజీవి లాంటి నటుడి జీవితానికి దగ్గరగా అనిపించింది.




# ఆస్కార్ బరిలో నాటు నాటు పాట



ఆర్ఆర్ఆర్ చిత్రంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ డ్యాన్స్‌ను ప్రపంచవ్యాప్తంగా ఉ న్న మూవీ లవర్స్ ఎంతగా ఇష్టపడతారో చెప్పేందుకు ఈ ఒక్క పాట చాలు. గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద తెలుగు సినిమా రేంజ్ ఏంటో మరోసారి చూపించింది ఆర్ఆర్ఆర్. ఈ సినిమాలోని నాటు నాటు పాట వరల్డ్‌వైడ్‌గా మార్మోగిపోయింది. సాంగ్ ప్రోమో విడుదలైనప్పటి నుంచి ఇప్పటికీ.. ఎప్పటికీ కూడా ఈ పాట టాక్ ఆఫ్ ది గ్లోబల్ ఇండస్ట్రీగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. చంద్రబోస్ రాసిన నాటు నాటు పాటను ఎంఎం కీరవాణి కంపోజ్ చేయగా.. కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. పక్కా ఊరమాస్ స్టెప్పులతో స్టార్ హీరోలు రాంచరణ్, జూనియర్ ఎన్టీఆర్ అదిరిపోయే డ్యాన్స్ చేసి గ్లోబల్ బాక్సాఫీస్ దుమ్ము దులిపేశారు. ఈ పాటపై డబ్ స్మాష్ వీడియోలు ఎన్ని వచ్చాయో చెప్పడం కష్టమే. ఇక ఈ సాంగ్‌లో ఉక్రెయిన్ భామ ఒలీవియా మొర్రీస్ కూడా నాటు నాటుగా ఇరగదీసే స్టెప్పులేస్తూ ప్రేక్షకులతో ఈలలు వేయించిందంటే క్రేజ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. 95వ ఆస్కార్ అవార్డ్స్ నామినేషన్స్‌లో షార్ట్‌లిస్ట్ జాబితాలో ఆర్ఆర్ఆర్ చోటుదక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ జాబితాలో ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆర్ఆర్ఆర్‌లోని 'నాటు నాటు' పాటకు స్థానం దక్కింది.ఆస్కార్‌కు పోటీపడుతున్న మొత్తం 81 ట్యూన్స్ నుంచి 15 పాటలను షార్ట్ లిస్ట్ చేశారు. ఈ పాటల్లో నాటు నాటుతోపాటు అవతార్-2లోని నథింగ్ ఈ లాస్ట్, బ్లాక్ పాంథర్‌లోని లిఫ్ట్ మీ అప్, టాప్ గన్ సినిమాలోని హోల్డ్ మై హాండ్ ఉ న్నాయి. ఈ 15 సినిమాల్లో ఐదు మూవీస్‌ను జనవరిలో ఆస్కార్‌కు నామినేట్ చేస్తారు. కాగా వీటిలో నాటు నాటు సాంగ్ విజేతగా నిలవడం ఖాయమని ధీమాగా ఉన్నారు మూవీ లవర్స్. మార్చి 12న హాలీవుడ్‌లోని డాల్బీ థియేటర్‌లో ఆస్కార్ అవార్డులను ప్రకటించనున్నారు.

# 6 సార్లు తృటిలో చేజారిన శతకం! అయితే ఏంటి? నాకు అదే ముఖ్యమంటూ..



రాజ్‌కోట్.. వెస్టిండీస్‌పై 92 పరుగులు... అదే ఏడాది.. అదే జట్టుతో హైదరాబాద్‌లో మ్యాచ్‌లో 92 పరుగులు..2021.. సిడ్నీ.. ఆస్ట్రేలియాపై 97 పరుగులు.. 2021.. ఇంగ్లండ్‌పై చెన్నైలో 91 పరుగులు.. 2022.. మొహాలీ.. శ్రీలంకపై 97.. తాజాగా బంగ్లాదేశ్‌పై మిర్పూర్‌లో 93... ఇలా ఆరుసార్లు తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు టీమిండియా యువ ఆటగాడు రిషభ్ పంత్.బంగ్లా పర్యటనలో భాగంగా రెండో టెస్టు రెండో రోజు ఆటలో అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు ఈ వికెట్ కీపర్ బ్యాటర్.టాపార్డర్ విఫలమైన వేళ నేనున్నానంటూఅభయమిచ్చాడు. శ్రేయస్ అయ్యర్(87)తో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దాడు.ఆరో'సారీ'మొత్తంగా 105 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 93 రన్స్ చేసిన పంత్.. శతకానికి ఏడు పరుగుల దూరంలో నిలిచిపోయాడు. ఇలా తృటిలో సెంచరీ చేజారడం పంత్‌కు ఇది ఆరోసారి. దీంతో రిషభ్ పంత్ సెంచరీ గండం గట్టెక్కలేకపోతున్నాడన్న విశ్లేషణల నేపథ్యంలో అతడు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.సెంచరీ మిస్ అవ్వడంపై పంత్ స్పందిస్తూ.. "వ్యక్తిగతంగా నా ప్రదర్శన బాగుంది. నేను మెరుగ్గా బ్యాటింగ్ చేశానని నాకు తెలుసు. ఆ మూడు అంకెల సంఖ్య నా దృష్టిలో పెద్ద విషయమేమీ కాదు. జట్టు కష్టాల్లో ఉన్నపుడు పరిస్థితులకు తగ్గట్లు ఆడటంపైనే ఫోకస్ చేస్తా.ఒకవేళ ఈ క్రమంలో ఏదైనా మైలురాయిని చేరుకుంటే ఆనందమే. అంతేగానీ.. శతకం చేజారిందనే బాధ లేదు. నిజానికి శ్రేయస్ అయ్యర్, నేనూ కలిసి జట్టును కష్టాల్లో పడకుండా కాపాడినందుకు సంతోషంగా ఉంది" అని పేర్కొన్నాడు. మూడో రోజు ఆట ఆరంభానికి ముందు పంత్ ఈ మేరకు వ్యాఖ్యానించాడు. అయ్యర్ సైతం తనకు జట్టు ప్రయోజనాలే ముఖ్యమని తెలిపాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190